# శిల్పి

## కప్పగంతుల మల్లికార్జునరావు

రెండు కారుల్లో అనుచరులు వేంట రాగా అట్టహాసంగా కారు దిగాడు యమ్మెల్లే శేఖర్ లాయర్ వెంకట్రామయ్య ఆ అట్టహాసాన్ని చూచాడు

రోటరి క్లబ్ సభ్యులు అతనికి స్వాగతం చెప్తున్నారు అనుచరులు యమ్మెల్లే శేఖర్ జిందాబాద్ అని నినాదాలు చేసేరు

నిన్న మొన్నటి దాకా శేఖర్ యీ కార్యక్రమంలో పాల్గొనే అనేక మంది యువకుల్లో వొకడు వక్తృత్వ పోటీల్లో వ్యాస రచన పోటీలో ఎన్నోసార్లు యీ వేదిక మీదే బహుమతులు స్వీకరించాడు ఆ ఊళ్లోని కాలేజీల్లోకల్లా వొక సబ్జక్టులో ఫస్టు మార్కు వచ్చినందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను పొందాడు

తనకి నమస్కారాలు పెట్టిన యువకుడు, యీ వాళ గాలి వాటంలో పడి యమ్మెల్లే అయి కూర్చున్నాడు తను అతనికి మర్యాదలు చేసి ఆహ్వానించాలా?

అలా ఆలోచించిన వెంకట్రామయ్యకు యింతలో తన బాధ్యత గుర్తుకొచ్చింది

రోటరి క్లబ్ ఏటేటా నిర్వహించే యీ స్కాలర్‌షిప్ ప్రధానోత్సవ సభ ముఖ్య నిర్వాహకుడు తను యీ సంవత్సరం సభకు అధ్యక్షత వహించటానికి ఆహ్వానించబడ్డ అతిథి శేఖర్

స్వాగతం మిస్టర్ శేఖర్ నాలుగడుగులు ముందుకు వేసి శేఖర్‌కి ఎదురు వెళ్లి ఆహ్వానించాడు వెంకట్రామయ్య

శేఖర్ నవ్వుతూ హుందాగా తల పంకించాడు ,

ముఖ్య అతిథి, సన్మానితురాలు వచ్చిందా?

వచ్చింది

మన ఊరి అమ్మాయి అయ్యేయస్ ఫస్టు వచ్చిందా? నాకు తెలియని ఆ సుబ్బలక్ష్మి ఎవరండి? ముందుకు నడుస్తూనే అడిగాడు శేఖర్

చూస్తారుగా తొందరెందుకు?

శేఖర్‌కి అయ్యేయెస్ ఆఫీసర్ కావాలన్న కోరిక చిన్నప్పటి నుంచి వుంది ఆ దృష్టితోనే చదివేడు అయ్యేయస్ పరీక్షలకు చాలా సార్లు కూర్చున్నాడు

ప్రతిసారి రిటన్ పాసయ్యేవాడు కానీ ఫైనల్ సెలక్షన్ కొద్దిలో తప్పిపోయేది అన్ని ఛాన్సులు అయిపోయాక చేసేది లేక లెక్చరర్ ఉద్యోగంలో చేరేడు

లెక్చరర్ ఉద్యోగం చేస్తుండగానే ఎన్నికలొచ్చాయి కొత్తగా పెట్టిన పార్టీ టిక్కెట్టుకు సర్దాగా అప్లయి చేసేడు టిక్కెట్టు దొరికింది అంతే కాదు ఆ పార్టీ నాయకుడికి అనుకూలంగా వీచిన గాలిలో కొట్టుకుపోయి యమ్మెల్లే కూడా అయ్యాడు మంత్రికూడా అయ్యేవాడే కాని కుల ప్రాతినిధ్యాలలో తేడా వచ్చి అది కాస్తా తప్పిపోయింది అయినా నాయకుడికి యిష్టుడైన వాళ్లల్లో అతనూ వొకడు

శేఖర్ సభ జరిగే హాలులోకి ప్రవేశించాడు హాలుకిక్కిరిసి వుంది

తను ప్రవేశించగానే జనం జయ జయ ధ్వానాలు చేస్తారని ఆశించాడతను చెయ్యకపోవటంతో వెనక్కి తిరిగి అనుచరుల వైపు చూచాడు.

అనుచరులు అతనికి జై కొడుతూ నినాదాలు చేసేర్లు

వెంకట్రామయ్యగారూ మీరు అప్పటి నుంచి యిప్పటిదాకా యీ కార్యక్రమాన్ని అత్యంత జయప్రదంగా నిర్వహిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉందండి ప్రభుత్వ సహకారం ఏమన్నా కావాలంటే చెప్పండి ప్రయత్నిస్తాను

వెంకట్రామయ్య నవ్వుకొన్నాడు

రాజకీయాలే మనిషి మనసును బుద్ధిని పెడత్రోవ పట్టిస్తాయి రాజకీయాధికారం కూడా లభిస్తే మనిషి భ్రష్టుడవుతాడనటానికి యిది నిదర్శనం కాదూ?

వెంకట్రామయ్య కూడా యువకుడే ధనవంతుడు తండ్రి వృత్తికి లా చదివి వారసుడయ్యాడు లాయర్‌గా బాగా సంపాదిస్తున్నాడు

చిన్నతనం నుంచి అతనికి సమాజ సేవ చేయాలన్న తపనవుంది

పెద్దయ్యాక రోటరి సంస్థలో చేరి సాధ్యమయినన్ని సమాజ కార్యక్రమాలను చేపట్టేడు అందులో వొక భాగంగా విద్యార్థులకు ప్రతిభావంతులకు అనేక రంగాలలో స్కాలర్‌షిప్ యిచ్చే కార్యక్రమాన్ని ప్లాన్ చేసి రోటరి పక్షాన అమలు పర్చేడు

యింతింతై వటుడింతయై అన్నట్టు ఆ కార్యక్రమం పెరిగి పెరిగి యిప్పుడు వొక పెద్ద పండుగలా జరుపుకొనే స్థాయికి చేరింది ఊరికి విశిష్ట గౌరవాన్ని తీసుకొచ్చిన వ్యక్తికి సన్మానం చేయటం అన్న కార్యక్రమం యీ సంవత్సరమే ప్రవేశ పెట్టబడింది,

అలా మొదటిసారిగా సన్మానించబడుతున్న వ్యక్తి ఓ యువతి

అయ్యేయస్ ఆఫీసర్‌గా సెలక్టు కాబడటం వొక గొప్పా? ఊళ్లో యిందరు ప్రముఖులు వుండగా ఆ అమ్మాయికి ఎవరికో సన్మానం చేయ్యటం ఉచితమా? యింతకి ఆ సుబ్బలక్ష్మి అసలు ఎవరట? కొందరు అలా విమర్శించిన వారు కూడా లేకపోలేదు

నీకు తెల్సుగా మిస్టర్ శేఖర్! స్వచ్ఛంద సేవ చేసే వారు ప్రభుత్వ సహాయాన్ని ఆశిస్తారా?

పోనియ్యండి ముఖ్య అతిధి ఏది? ఆ అమ్మాయిని నాకు వొకసారి పరిచయం చెయ్యరా?

ఆమె యింకా రాలేదు రాగానే పరిచయం చేస్తాను రమ్మని కబురు చేసేను

వచ్చిందన్నారిందాక?

వచ్చింది. వచ్చి అదుగో ఆ యింట్లో వుంది

వెంకట్రామయ్య వేలు చూపిన వైపు చూచాడు శేఖర్

ఆ యిల్లు మీ రోటరి హాలు స్వీపర్ చంద్రమ్మ వుండే ఔట్ హవుస్ కదూ?

అవును

అంటే సన్మానితురాలు సుబ్బలక్ష్మి

యు ఆర్ రైట్ మిస్టర్ శేఖర్ మీ ఊహ సరైనదే

శేఖర్ దిగ్భ్రమ చెందేడు! ఆలోచనలో పడ్డాడు

★ ★ ★

సుబ్బులూ ! యివాళ రోటరి హాలులో నా ఉపన్యాసం వుంది వినటానికి రా నువ్వుండేది అక్కడేగా అన్నట్టు చప్పట్లు కొట్టాలేవ్

చిన్నబాబుగారు అలా ఎల్లేసరికి సుబ్బులు ఉబ్బి తబ్బిబ్బయింది

తను పని ఎల్లా చదువు సంధ్యలు లేనిది

చిన్నబాబు యజమాని దర్జాగా దొరబాబులా వుంటాడు

అట్టాగేనండి మా అమ్మమ్మనడిగి వత్తా

ఫస్టు ప్రయిజు నాదేనే నాలాగా మాట్లాడే వాళ్లెవరున్నారు?

చిన్నబాబుకు పని ఎల్లా దగ్గరయినా తనని తాను పొగుడుకోటం సర్దా తనని యితరులు పొగుడుతుంటే మరింత థ్రిల్

సుబ్బులు యింటికొచ్చేసరికి అమ్మమ్మ హడావుడిగా వుంది

సుబ్బులూ హాల్లో బల్లలు కుర్చీలు సర్దాలి కాస్త సాయం పట్టవే తల్లీ

మా సన్నబాబుగారు యీడ సభలో మాట్లాడతారట నేనూ యింటాను

అమ్మమ్మ కాదనలేదు కానీ వొక్క మాట అంది

అల్లు మాట్లాడేదేంటో నాకే అరదం కాదే నీకేం అరదమయి సత్తుంది

ఎందుకర్థం కాదు? పట్టుదలగా విన్నది

చాలా మంది పిల్లలు మాట్లాడేరు అందరూ సుబ్బులు యీడు వాళే

చిన్నబాబు బాగానే మాట్లాడేడు కానీ అంత కన్నా బాగా వొక అమ్మాయి మాట్లాడింది వక్తృత్వ పోటీలో ఆ అమ్మాయికే బహుమతి వచ్చింది చిన్నబాబుకి రెండో బహుమతి వచ్చింది

నా ఉపన్యాసం ఎలా వుంది? మర్నాడు పనిలోకి వెళ్లినప్పుడు చిన్నబాబు సుబ్బుల్ని అడిగేడు

బాగుంది కానీ ఆ అమ్మాయెవరో మీకన్నా బాగా మాట్లాడింది సినబాబూ? అంత సన్న పిల్లకి అన్నన్ని ఆలోసెనలు, మాటలు, ఎట్టా వచ్చాయో?

చిన్నబాబుకు సుబ్బులు మీద కోపం వచ్చింది.

'చదువు రాని మొద్దువి నీకవన్నీ చెప్పినా తెలియవులే. నిన్ను పిలవటం అసలు నా బుద్ధి తక్కువ'

సుబ్బులు చిన్నబాబు తిట్టినందుకు బాధ పడలేదు. ఆలోచించింది.

'అమ్మమ్మా. నేనూ సదువుకొంటానే' యింటి కొచ్చాక అమ్మమ్మతో అంది

'సదూకొంటావా? నువ్వా? నీకి బుద్దెందుకు పుట్టిందే యిప్పుడు?'

చిన్నబాబుతో జరిగిందంతా చెప్పింది సుబ్బులు

'అయితే సినబాబునే సదువు కూడా చెప్పమను'.

మర్నాడు పని అయ్యాక చినబాబును పట్టుకొంది సుబ్బులు

'ఏమిటి? నువ్వు చదువుకొంటావా? నీకు నేను చదువు చెప్పాలా? నాకేం పని లేదనుకొన్నావా? నేనంటే నీకంత లోకువయిపోయిందా? అయినా అంట్లు తోముకునే నీకు చదువేం వస్తుంది? పాచి పని చేసుకు బతక్క అసలు చదువెందుకంట నీకు?'

యీసారి సుబ్బులు ఏడుస్తూ యింటి కొచ్చింది. అమ్మమ్మ ఎంత ఓదార్చినా ఆమెకు దుఃఖం తగ్గలేదు

'ఏం? అంట్లు తోముకునే వాళ్లు సదువుకో కూడదా? సదువుకొన్న వోళ్లు అంట్లు తోమటం లేదా ఏం? నేను పనికి వెళ్లకపోతే, సినబాబుగారి అమ్మగోరు అంట్లు తోముకోదా? ఆమె సదువు కొందిగా? అసలు సదువుకు పాసి పనికి సంబంధ మేంటంట? నేను అంట్లు తోముతా. పాసి పని సేత్తా. సదువుకొంటాను కూడా సదువుకొన్నాక కూడా ఆ పనులు సేత్తా తప్పేంది?'

'అట్టాగే సేద్దువుగాని లేవే ముందు ఏడుపు ఆపు.'

'నేను ఆపను. నాకు సదూ సెప్పుత్తానంటే తప్ప ఆపను'.

అమ్మమ్మ యిరకాటంలో పడింది ఏం చెయ్యాలో తోచలేదు

సుబ్బులుకు చదువు చెప్పించకుండా పనిలో దించి తాను పొరపాటు చేసేనేమోననిపించిందామెకు.

తనకు మాత్రం సుబ్బులు కాక ఎవరున్నారు?



భర్త లేడు. కూతురు అల్లుడు అర్థాంతరంగా చనిపోయారు

దయతల్చి ఆ శ్రీధరుగారు యీ పనిని తనకివ్వబట్టి సరిపోయింది కానీ లేకపోతే తను సుబ్బుల్తో ముష్టెత్తుకోవాల్సి వచ్చేది కాదూ?

ముసలాయన వాచ్‌మెన్. కానీ ఆడది తను? తనకు ఆ ఉద్యోగం యివ్వటం ఎలా?

'నువ్వు వాచ్ వుమెన్‌వి స్వీపర్‌వి హాలును చూచుకో' శ్రీధరు గారు ఆలోచించి చివరికి నిర్ణయించారు.

అలా తనకు జీవన భృతి నిలిచింది

కానీ సుబ్బులు ఆడపిల్ల. తను ముసలిదయి పోతున్నది

తన తర్వాత సుబ్బులుకు ఆధారం ఏమిటి?

పెళ్లి చెయ్యాలి. పెళ్లి చేయాలంటే డబ్బు కావాలి.

తను సంపాదించేదానిలో ఎంతని కూడబెట్ట గలదు?

అందుకే అవకాశం దొరకగానే సుబ్బుల్ని పనిలో పెట్టింది సుబ్బులు పెళ్లి కోసం డబ్బు పోగు చేస్తోంది

ఆ రోజు చదువుకుంటానని సుబ్బులు అంటే ఎలా వుండేదో? కానీ యిప్పుడంటోంది. యిప్పుడు సుబ్బులికి పధ్నాలుగేళ్ళు వచ్చాయి

పెళ్లా? చదువా?

'పెళ్లి ఎప్పుడన్నా సేసుకోవచ్చు. నేను ముందర సదువుకుంటా' తెగేసి చెప్పింది సుబ్బులు.

'కానీ యిప్పుడెలాగే? సదువెవరు సెప్తారు? బళ్లోకి రానిత్తారా?'

'రానిచ్చి నా నేను బళ్లోకి పోను. కానీ నేను సదువుకొంటా'

బళ్లోకి పోకుండా చదువుకోటం ఎలా సాధ్యమో అమ్మమ్మకు అర్థం కాలేదు

'ఉండవే నీ బండ బడ శ్రీధరుగారితో సెప్తానుండు'.

★ ★ ★

'అంటే- మా యింట్లో పని పిల్ల సుబ్బులే యీ సుబ్బులక్ష్మా?'

'అవును మానసికంగా, బౌద్ధికంగా మాత్రం ఆ సుబ్బులు యీ సుబ్బులక్ష్మి వొకటి కాదు-'

'కానీ అదెలా సాధ్యం? నేను నమ్మలేకుండా వున్నాను' శేఖర్ అన్నాడు.

'పట్టుదల వుంటే సాధ్యం కానిది వుంటుందా శేఖర్?'

అలా అంటుంటే వెంకట్రామయ్యకు సుబ్బులు పట్టుదల, దీక్ష గుర్తుకొచ్చాయి

★ ★ ★

అమ్మమ్మ చెప్పిందంతా విని సుబ్బుల్ని పిల్చి పరీక్షించాడు శ్రీధరుగారు.

సుబ్బులులాంటి పిల్లకు విద్య చెప్పటం కన్నా మించిన సమాజ సేవ ఏముంది?

'సుబ్బులూ. నీకు చదువు నేను చెప్తాను.'

'మీరా బాబుగోరూ. మీకు తీరికేడుంటుంది?'

'తీరిక వుండదు అవ్వా. తీరిక చేసుకుంటే

# జీవితం

జనన మరణాలు
వెలుగు చీకటులు
సుఖ దుఃఖాలు
కలల కన్నీళ్ళు
ఆశలు ఆవేశాల మధ్య
కదిలేదే మానవ జీవితం!

—కె. వి. శివరామకృష్ణ



వుంటుంది నిద్రా కాలం తగ్గిస్తే తీరిక చిక్కదూ!'

సుబ్బులు ఏకసంథాగ్రాహి. యిలా చెప్తే అలా గ్రహించేది

'సుబ్బులూ మన పెద్దలు వాక్కును తపస్సు అన్నారు. స్వచ్ఛంగా మాట్లాడటం నేర్చుకో-'

శ్రీధరుగారిని చూచి అతనిలా స్వచ్ఛంగా మాట్లాడటం నేర్చుకొంది. చదవటం, రాయటం, చిన్న చిన్న లెక్కలు చేయటం వచ్చాయి.

'యీ చదువు చాలా సుబ్బులూ?'

'చదువుకు చాలటం ఎక్కడ వుంటుంది మాస్టారూ. నేను శేఖర్‌లా చదవాలి. కాదు, శేఖర్‌కన్నా ఎక్కువ చదవ్వాలి: అతనికన్నా బాగా ఉపన్యాసం యివ్వగలగాలి. యిన్నేళ్ళు నేను నష్టపోయినదాన్ని పూడ్చుకొని అతనితో పాటు చదువులో కల్సిపోవాలి మాస్టారూ. ఎలాగో మార్గం చెప్పరూ?'

'మెట్రిక్‌కు కట్టి చదువు సుబ్బులూ'

మెట్రిక్ సులభంగా పాసయింది. శ్రీధరుగారే శిక్షణనిచ్చారు

'యింక కాలేజిలో చేరదల్చుకొంటే చేరు సుబ్బులూ. బీదవారికిచ్చే స్కాలర్‌షిప్‌ను కూడా యిస్తాము.

'వద్దు మాస్టారూ పని చేస్తూ చదవాలి నేను. పైగా నేను చదువుతున్నట్టు ఎవరికి తెలియ కూడదు పొగడ్తలు, పబ్లిసిటీలంటే నాకు యిష్టం లేదు అవి మనిషి ఎదుగుదలకు మేకును కొట్టాయని మీరే కదా చెప్పేరు?'

'ఆ మాట నిజమే. కానీ నువ్వు యింకా పాచి పని చేస్తావా? నీకు వయసు వచ్చిందని మర్చిపోకు సుబ్బులూ.'

తన వయసును, దానితో పాటు పెరుగుతున్న వొంపు సొంపుల్ని ఆమె అప్పుడు గుర్తించింది.

అందుకే కాబోలు! శేఖర్ తనని మధ్య అదో రకంగా చూస్తున్నాడు.

శేఖర్ వొక్కడేనా? వీధిలో ఎదురైన ప్రతి వాడూ చూస్తున్నాడు కదా!

'అయితే మీరే నాకేదన్నా మరో పని చూపించండి మాస్టారూ'

'శ్రీధర్ని పర్మనెంట్‌గా మాస్టర్ని చేసేసేవ్?'

'మీరు నాకెప్పుడూ గురువులే మాస్టారూ. పూజనీయ గురువులే'

శ్రీధరుగారు ఆమెకు పని చూపించాడు

సుబ్బులు డిగ్రి సంపాదించింది విజ్ఞానాన్ని వృద్ధి చేసుకొంది

'యిప్పుడు నువ్వు కోరుకుంటే మంచి ఉద్యోగమే చిక్కుతుంది సుబ్బులూ నువ్వు వెనకబడిన కులానికి చెందినదానివి కనుక ఉద్యోగం చిక్కటం సులభం కూడా-'

'కానీ నేను కులాన్ని ఉద్యోగ సంపాదనకు ఉపయోగించుకోను మాస్టారూ. నా మెరిట్ మీదనే ఆధారపడ్తాను యింకో విషయం మాస్టారూ మీరేమనుకోనంటే నా మనసులో కోరిక చెప్తాను '

చెప్పు సుబ్బులూ'

ఆమె కోరిక విని శ్రీధరుగారు ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు.

'నీ లక్ష్యం మంచిదే సుబ్బులూ. కానీ దాన్ని సాధించటం మాత్రం అంత సులభం కాదు. పట్టుదల, పరిశ్రమ ..

'నాకు ఆ రెండూ వున్నాయి మాస్టారూ. యమ్మే చదువుతాను కానీ నా లక్ష్య సాధనకు యిప్పటి నుంచే పరిశ్రమిస్తాను.'

'కానీ యిక నీకు కోచింగ్ యిచ్చే శక్తి నాకు లేదు సుబ్బులూ. ఎక్కడ కోచింగ్ తీసుకుంటావు-'

'సెల్ఫ్ కోచింగ్ మాస్టారూ. మీరు సందేహాలు అప్పుడప్పుడూ తీర్చండి. మార్గదర్శనం చెయ్యండి చాలు'.

సుబ్బులు రెండు సంవత్సరాలపాటు సర్వాన్ని మర్చిపోయి పరిశ్రమించింది.

ఎన్నెన్ని పుస్తకాలు చదివిందో? పత్రికలను తిరగేసిందో?

ఆమెతో చర్చించటం శ్రీధరుగారికే అసాధ్యమని పించేది!

'యిక నీకు నేను గురువును కాను సుబ్బులూ. నువ్వే నాకు గురువులా కన్పిస్తున్నావు. ఎంతలో ఎంత బౌద్ధికంగా ఎదిగిపోయావు సుబ్బులూ? నీ లక్ష్యాన్ని నువ్వు తప్పక సాధిస్తావు'

సుబ్బులు యమ్మే పాసయింది. అయ్యేయస్‌కు కూడా కూర్చుంది కానీ రిటన్‌లో తప్పిపోయింది.

'యీ ఓటమి వచ్చే సంవత్సరం రాబోయే విజయానికి పునాది మాస్టారూ. అనుభవం వచ్చింది కదా?'

'గుడ్. కానీ ఎంత సేపు చదువు రంధేనా? మీ అమ్మమ్మ నీ పెళ్లి విషయంలో బెంగ పడ్తోంది. పెద్ద దయిపోతున్నది కదా? నీ పెళ్లి చూడాలని ఆమె కోరిక'

సుబ్బులు నవ్వింది.

'అమ్మమ్మ కోరికను కూడా నెరవేరుస్తాను మాస్టారు. కానీ యిప్పుడు నా పెళ్లి వొక సమస్య అంటారా? నా కన్నా పెద్ద వారు- మీరింకా ఎందుకు పెళ్లి చేసుకోలేదు? కారణం తెల్సుకోవచ్చా మాస్టారూ?

'చేసుకోవాలనే వుంది సుబ్బులూ. కానీ నా అభిరుచులకు ఆశయాలకు సరిపడ్డ వ్యక్తి చిక్కాలి కదా? అన్వేషిస్తున్నాను'

'నేను కూడా నాకు సరిపడే వ్యక్తిని అన్వేషించి లక్ష్యసాధన పూర్తి కాగానే పెళ్ళి చేసుకుంటాను మాస్టారూ. అమ్మమ్మకు అలా నచ్చ చెప్పండి'

ఆ మరుసటి సంవత్సరం అన్ని అంచెలను అవలీలగా దాటి ఆమె అయ్యేయస్ టాప్‌రేంకర్‌గా పాసయింది.

★ ★ ★

హాలు వొక్కసారిగా చప్పట్లతో మారు మోగింది.

సుబ్బలక్ష్మి తన అమ్మమ్మ చంద్రమ్మను నడిపించుకుంటూ హాలులోకి ప్రవేశించింది.

శేఖర్ సుబ్బలక్ష్మిని చూచాడు కానీ మాట్లాడలేదు.

'చిన్నబ్బాబుగారూ బాగున్నారా?' సుబ్బలక్ష్మి పక్కన కూర్చుంటూ శేఖర్‌ని పలకరించింది.

'సుబ్బులూ సుబ్బలక్ష్మి అంటే నువ్వేనా?'

సభా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాడు వెంకట్రామయ్య

'నేనే చినబాబూ యిదంతా మీ దయే'

ఆ పొగడ్తను నిజమనుకొని శేఖర్ గర్వపడ్డాడు

'నేను యమ్మెల్లేనయ్యాను తెల్సా? మంత్రిని కూడా కావల్సింది కొద్దిలో తప్పిపోయింది త్వరలో అయి తీరుతాను నీకేదన్నా సహాయం కావాలంటే అడుగు ఎంతైనా నువ్వు ఉద్యోగినివి. మేము ప్రజా ప్రతినిధులమైన మంత్రులం ఏమంటావు?'

'అప్పటికి యిప్పటికి మీరేమి మారలేదు చినబాబూ' నవ్వుతూ అంది సుబ్బలక్ష్మి

ఇంతలో వెంకట్రామయ్య అతిధులందరినీ వొక్కొక్కరిని వేదిక మీదకి ఆహ్వానించాడు వేదిక మీదికి వస్తూ తను అనుచరులను పిల్చి శేఖర్ ఏమో చెప్పేడు

మన నగరంలో వివిధ రంగాలలో ప్రతిభావంతు లయిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు యిచ్చే కార్యక్రమాన్ని మా రోటరీ క్లబ్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న విషయం మీకందరికీ తెల్సిందే. అయితే యీ సంవత్సరం జరుగుతున్న యీ సభకు వొక ప్రత్యేకత వుంది. యీనాటి సభకు అధ్యక్షత వహిస్తున్న శ్రీ శేఖర్ గతంలో అనేక మార్లు యీ వేదిక మీద స్కాలర్‌షిప్పులను, బహుమతులను అందుకొన్న యువకుడు. అలాగే యీనాటి సన్మానితురాలు, మా రోటరీ హాలు వాచ్ వుమెన్ చంద్రమ్మ మనమరాలు. యిక్కడ జరిగే యీ కార్యక్రమాలను చూచి ప్రతిభావంతురాలై చదువుకొని ఉన్నత దశకు వచ్చింది. ఆమె స్కూలు మొహం చూడలేదు స్వయం కృషితో చదివింది. నేనొకసారి ఆమెకు బీద వారికిచ్చే స్కాలర్‌షిప్పు యిస్తానన్నాను ఆమె తిరస్కరించింది కుల రీత్యానూ ఆర్థికంగానూ కూడా నిజంగా వెనకబడి వున్నప్పటికి సుబ్బలక్ష్మిగారు ప్రభుత్వం యిచ్చే రిజర్వేషన్లను ఆశించలేదు. కులాన్నే పేర్కొనలేదు కేవలం మెరిట్ మీద ప్రథ మ రాలుగా అయ్యేయస్‌లో ఎన్నిక కాబడ్డ ఆమెను సన్మా నించటం- ప్రతిభను, స్వయం కృషిని, ఆత్మవిశ్వా సాన్ని, పట్టుదలను సన్మానించటంలా మేము భావిస్తున్నాము'.

అంతా కరతాళ ధ్వనులు చేసేరు.

ఆ తర్వాత శేఖర్ అధ్యక్షోపన్యాసం చేసేడు.

చిన్న తనం నుంచి తను ఎన్ని రంగాలలో ఎలా కృషి చేసింది చెప్పుకొన్నాడు. యీ రోటరీ క్లబ్ ఫంక్షన్‌లో తను ఎన్నెన్ని బహుమతులు పొందింది వివరంగా చెప్పేడు.

'మా పార్టీ యువకులది. మా ప్రభుత్వం యువకులది. యువత కోసం మా పార్టీ, ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది' అంటూ ఆ వివరాలు చెప్పుకొచ్చాడు.

చివరికి అసలు విషయంలోకి వచ్చాడు

'యీ సభకు వొక ప్రత్యేకత వుందని శ్రీ వెంకట్రామయ్యగారు ప్రకటించారు. అందుకే నేనీ సభలో వొక ప్రత్యేక ప్రకటన చేయదల్చుకొన్నాను.

'నాకు విద్యకు కొరత లేదు ప్రతిభకు కొరత లేదు. ధనానికి కొరత లేదు. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి ప్రజా సేవ చేయాలన్న కోరికతో రాజకీయాల్లోకి దిగేను. రేపో మాపో రాజకీయాధికారాన్ని సంపాదిస్తానన్న విశ్వాసం నాకుంది అందుకు మీ ఆశీర్వచనాన్ని కోరుతున్నాను' అనుచరులంతా చప్పట్లు కొట్టి జయ జయధ్వానాలు చేసేరు

'యిన్ని వున్నా నాకు తృప్తి లేదు. ఏదో కొరత. ఏమో చేయాలన్న తపన. ఆ కొరత ఏమిటో యీ సభకు వచ్చాక తెల్సుకొన్నాను.

'సన్మానితురాలు సుబ్బలక్ష్మి వొకప్పుడు మా యింట్లో పని మనిషిగా పని చేసింది కులం చేత, డబ్బు చేత కూడా ఆమె బీదదే అయినా ఆమె తన పట్టుదలతో చదువుకొని పరీక్షలు పాసయింది అది ఆమె కృషి ఫలితం. కానీ సమాజానికి అలాంటి వారిని యింకాపైకి తీసుకుపోవాల్సిన బాధ్యత వుందని నేను నమ్ముతున్నాను ఉద్యోగాలివ్వంగానే సరి కాదు వార్ని సంఘంలోని ఉన్నత వర్గాల వారు తమలో కలుపుకోవాలి. అప్పుడే సమానత్వం వస్తుంది'

అనుచరులు మళ్ళీ చప్పట్లు కొట్టి 'జై'లు కొట్టేరు

'అంచేత నేనో నిర్ణయానికొచ్చాను. సుబ్బలక్ష్మి గారికి సన్మానం జరిగేక నా నిర్ణయాన్ని ప్రకటిస్తాను '

'సంఘ సంస్కర్త-శేఖర్-జిందాబాద్'

ఆ తర్వాత సుబ్బలక్ష్మికి సన్మానం జరిగింది యువతీ యువకులు కొందరు ఆమెను పొగడుతూ మాట్లాడేరు.

యిక తర్వాత మాట్లాడవల్సింది సుబ్బలక్ష్మి. అంతా ఆమెను వినటానికి ఉత్సాహంగా వున్నారు

'యిప్పుడు నేను నా నిర్ణయాన్ని ప్రకటిస్తాను ఏ సామాజిక ఆర్థిక పట్టింపుల్ని పాటించకుండా, పైసా కట్నం ఆశించకుండా సుబ్బలక్ష్మిని వివాహం చేసుకోటానికి నిర్ణయించుకొన్నాను ఎప్పుడో-కాదు-యిప్పుడు-యీ వేదిక మీద. యీ క్షణంలో'.

హాలు హోరెత్తేలా అనుచరులు చప్పట్లు కొట్టేరు.

సుబ్బలక్ష్మి మాట్లాడటానికి లేచింది. హాలు నిశ్శబ్దమయింది.

'శేఖర్‌గారికి నన్ను గురించి ఎంత తెల్సునో, చిన్నతనం నుంచి ఆయన్ని గురించి నాకంత తెల్సు. ఆయన సంస్కరణాభిలాష నన్ను ముగ్ధురాలిని చేసింది కానీ నన్ను పెళ్ళి చేసుకోటం ద్వారా ఆయన అభిలాష నెరవేరదేమోనని భయం... ఆర్థికంగా, సాంఘికంగా, బౌద్ధికంగా నాకన్నా వెనుకబడిన యువతులు ఎందరో వున్నారు. అలాంటి వారిని ఎంతమందినైనా నేను చూపగలను. వారిలో ఎవరో వొకరిని పెళ్ళి చేసుకుంటే శేఖర్‌గారి సంస్కరణాభి లాషకు సాఫల్యత సిద్ధిస్తుంది

'అంటే నువ్వు నన్ను పెళ్ళి చేసుకోటానికి అంగీకరించవా?'

'నా అంగీకారం ప్రశ్న కాదు మీరెవరిని ఉద్ధరించాలన్నది ప్రశ్న కాదంటారా శేఖర్‌బాబూ. కాగా నా భాగస్వామిని నేనేనాడో నిర్ణయించు కొన్నాను అతనికి అంగీకారం కాకపోతే సమాజ సేవకి నన్ను అంకితం చేసుకొంటాను అంతే!'

'ఎవరో ఆ భాగస్వామి-?' ఎగతాళిగా అడిగాడు శేఖర్.

'ఎవరంటే- నన్ను యిలా మల్చిన శిల్పి- ప్లీడరు వెంకట్రామయ్యగారు'

శేఖర్ చివాలున కుర్చిలో నుంచి లేచి బయటికి వెళ్ళిపోయాడు అనుచరవర్గం ఆయన్ని అనుస రించారు

మిగిలిన అసలు ప్రేక్షకులు వెంకట్రామయ్య వైపు చూచారు.

అతను నిశ్చలంగా నవ్వుతూ పూలదండను చేతిలోకి తీసికొన్నాడు □

